## క్లుప్తంగా

### విజయదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మ

**పెదపూడి:** సంపర గ్రామంలో కొలువైన విజయదుర్గమ్మకు శుక్రవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. మాఘ మాసాన్ని పురస్కరించుకుని కుంకుమ పూజలు జరిపారు. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో చీర కట్టి అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు భక్తులతో లలిత, విష్ణు సహస్ర పారాయణ చేయించారు.

### నరసింహస్వామి కల్యాణానికి రాట ముహూర్తం



పుట్టకొండలో రాట ముహూర్తం చేస్తున్న ప్రముఖులు

**పెదపూడి:** పుట్టకొండ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి శుక్రవారం పందిరి రాట ముహూర్తం చేశారు. గ్రామ సర్పంచ్ వల్లు వెంకట రమణ, ఆలయ ధర్మకర్త, ఫౌండర్ పీపీ అనంతాచార్యులు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.అనంత గోపాలాచార్యులు ఆధ్వర్యంలో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ వడ్డాది సత్యనారాయణ మాట్లాడుతూ ఫిబ్రవరి 8న స్వామి కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నారన్నారు. ఆలయంలో ఫిబ్రవరి 13 తేదీ వరకు కల్యాణ ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు.

### అంబులెన్స్ సేవలు ప్రారంభం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

**రాజానగరం:** నియోజకవర్గంలో ఉచిత అంబులెన్స్ సేవలను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. రాజానగరంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం అంబులెన్స్ సేవలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాలలో 108 సేవలతో పాటు ప్రజల అవసరార్థం జనసేన అంబులెన్స్ సేవలు కూడా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో బత్తుల వెంకటలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన



విజేతలకు బహుమతులు అందిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాసరావు

**బిక్కవోలు:** మండలంలోని మెళ్లూరులో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా డీఎల్‌డీఏ కాకినాడ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 49 దూడలు పాల్గొన్నాయి. వీటిలో దూడల యజమానులైన మెళ్లూరు చెందిన అమజాల శ్రీహరి ప్రథమ, కొమన్న మురళీ ద్వితీయ, గొలకొటి వీరన్న తృతీయ బహుమతి గెలుపొందారు. అలాగే ఈ బిబిరంలో 50 పశువులకు చికిత్స చేశారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలోని అనపర్తి ఏడీ డాక్టర్ వై.శ్రీనివాసరావు, డీఎల్‌డీఏ కాకినాడ డాక్టర్ టి.నవీన్, డాక్టర్ డీవీ ప్రణీత్, డాక్టర్ వీర్రాజు, డాక్టర్ రవి కుమార్ పాల్గొన్నారు.

### సారా కేసులో మహిళ అరెస్ట్



నిందితురాలు, సారాతో ఎక్సైజ్ అధికారులు

**రంగంపేట:** సారా కేసులో మహిళను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఆమె శుక్రవారం సాయంత్రం మాట్లాడుతూ స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా రంగంపేట గ్రామంలో కొత్తపల్లి దుర్గను అరెస్టు చేశామన్నారు. ఆమె నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

# భవితకు వికాసం

- కిశోర వికాస్ పథకంతో బాలికలకు ఎన్నో ప్రయోజనాలు
- గ్రామాల్లో జరుగుతున్న సర్వే

**రాజానగరం:** కిశోర బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. వాటిలో మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా పునః ప్రారంభించిన కిశోర వికాస్ పథకం ఒకటి. ఆర్థిక ఇబ్బందులు, బాల్య వివాహాలు, కళాశాలలు అందుబాటులో లేక ఉన్నత చదువును పొందలేక పోతున్న బాలికలకు ఈ పథకం ద్వారా బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఈ పథకం కిశోర బాలికలకు ఒక వరమని చెప్పవచ్చు.

**బాలికల గణన**

రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరుగుతున్న ఈ పథకానికి సంబంధించి 14 నుంచి 18 ఏళ్ల వయసున్న బాలికలను గుర్తించడం కోసం నియోజకవర్గంలో గణన (సర్వే) చేపట్టారు. నియోజకవర్గంలోని మూడు మండలాలలో ఎంపీడీఓలు నోడల్ అధికారులుగా మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. అలాగే గ్రామ పంచాయతీల స్థాయిలో కూడా గ్రామ మహిళా పోలీసు, సంక్షేమ, విద్యా శాఖల సహాయకులు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ వర్కర్, డ్వాక్రా ప్రతినిధి, ఒక స్కూలు టీచరు సభ్యులుగా గ్రామ కమిటీలు పనిచేస్తున్నాయి.



కిశోర వికాస్ పథకంపై కమిటీలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి

**అవగాహన**

ఈ కమిటీలు తమ పరిధిలోని విద్యాసంస్థను సందర్శించి, అక్కడ చదువుతున్న కిశోర బాలికలకు ఈ పథకంపై అవగాహన కల్పించాలి. పాఠశాల, కళాశాల బయట (డ్రాపవుట్స్) ఉన్న బాలికల వివరాలను సేకరించాలి. ఈ విధంగా గుర్తించిన బాలికలను ఆయా పాఠశాలలు, కళాశాలల స్థాయిలోనే గ్రూపులుగా విభజించి, వారికి లింగ వివక్ష, సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, రుతుస్రవం సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుంచి ఏవిధంగా రక్షణ పొందవచ్చు, బాల్య వివాహాల నిర్మూలన, మానవ అక్రమ రవాణా, ఆత్మరక్షణ, నైపుణ్యం, ఉపాధి అవకాశాలపై శిక్షణ ఇస్తారు.

**పూర్తయిన శిక్షణ**

కిశోర బాలికల అభ్యున్నతికి కిషోర వికాస్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకున్నాం. ఇందులో భాగంగా నియోజకవర్గపరిధిలోని రాజానగరం, కోరుకొండతో పాటు జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని సీడీపీఓలు, ఎంపీడీఓలు, సూపర్‌వైజర్లకు ఇప్పటికే శిక్షణ ఇవ్వడం పూర్తయ్యింది. గ్రామ స్థాయిలో రీసర్వే జరుగుతోంది.

– **విజయ కుమారి**, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, రాజమహేంద్రవరం

**బాల్య వివాహాన్ని ఆపగలిగాం**

మండలంలోని ఒక గ్రామంలో కిశోర బాలికకు తల్లిదండ్రులు వివాహం చేయాలని ప్రయత్నించారు. విషయం తెలుసుకుని, అక్కడకు వెళ్లి ఆరా తీస్తే ఆర్థిక పరిస్థితుల కారణంగానే వారు ఈ పనికి పూనుకున్నట్టుగా తెలిసింది. వెంటనే ఆ బాలిక తల్లిదండ్రులకు బాల్య వివాహం వలన కలిగే ఇబ్బందులు, అనారోగ్యంపై అవగాహన కలిగించాం. అలా చేస్తే చట్ట పరంగా తీసుకునే చర్యలనూ వివరించాం. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆ అమ్మాయి చదువు పదో తరగతితోనే ఆగిపోయింది. ఇకపై ఆ అమ్మాయి చదువును కొనసాగించేలా కూడా చర్యలు తీసుకున్నాం.

– **టి.నాగమణి**, ఐసీడీఎస్ సీడీపీఓ, రాజానగరం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

## ఘనంగా ఫొటోగ్రాఫర్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**రంగంపేట:** మండల ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం శుక్రవారం ఏడీబీ రోడ్డు పక్కనే గల హర్ష కన్వెన్షన్‌లో వైభవంగా జరిగింది. ముందుగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగూరే చిత్రపటానికి ఏపీపీవీ డబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు పోసిన వీరేంద్ర కుమార్, జిల్లా అధ్యక్షుడు కోని శ్రీను, నూతన కార్యవర్గ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కార్యదర్శి కె.సత్యనారాయణ, ట్రెజరర్ జి.సతీష్, ఉపాధ్యక్షుడు జి.నాగేంద్ర, జాయింట్ సెక్రటరీ ఎస్‌కే లాల్ సాహెబ్, గౌరవ అధ్యక్షుడు వి.నాగబాబు, గౌరవ సలహాదారులు కె.ఏలియా, కె.సాయిరామ్, పదిమంది కార్యవర్గ సభ్యులతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ ట్రెజరర్ భాస్కర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథి వీరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ సంక్షేమానికి యూనియన్లు తోడ్పాటునందిస్తాయన్నారు. ప్రత్యేక అతిథి కోని శ్రీను మాట్లాడుతూ ఫొటో, వీడియో గ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను యూనియన్ పెద్దలు, సభ్యులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ కార్యదర్శి బెజగం కోటేశ్వరరావు, ట్రెజరర్ భాస్కర్ పాల్గొన్నారు.

## శత్రు పురుగులతో పంటకు నష్టం

**మధురపూడి:** రబీ సీజన్‌లో ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా పంటను నాశనం చేసే శత్రు పురుగుల ఉధృతిని అరికట్టవచ్చని వ్యవసాయ శాఖ ఏడీ బీకేఎంకే అర్జునరావు అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కోరుకొండ మండలం నర్సాపురంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగులో యాజమాన్య పద్ధతులను వివరించారు. మిత్ర పురుగుల వల్ల వ్యవసాయానికి లాభం జరుగుతోందని, శత్రు పురుగులతో నష్టం వాటిల్లుతుందున్నారు. పురుగు మందుల వినియోగాన్నిపెంచడం వల్ల శత్రు పురుగులు పెరిగి దిగుబడి తగ్గుతుందన్నారు. ఆ శాఖ మండలాధికారి గౌరి మాట్లాడుతూ ఎండు తెగులు, ఆకుముడత తెగుళ్ల నివారణకు యాజమాన్య పద్ధతులను వివరించారు.

## సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలి



చంద్రేడులో ఎలుకలకు ఎర పెట్టే విధానాన్ని రైతులకు వివరిస్తున్న ఏఓ శ్రీనివాసరావు



సంపత్ నగరంలో ఎలుకల మందు తయారీని వివరిస్తున్న వ్యవసాయాధికారులు

**రంగంపేట:** రైతులందరూ వరి పంటలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.శ్రీనివాసరావు సూచించారు. రంగంపేట, చంద్రేడు గ్రామాల రైతు సేవా కేంద్రాల వద్ద శుక్రవారం ఎలుకల మందు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ఎలుకల మందును ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎలుకల నిర్మూలనకు విషపు ఎరను తయారు చేసి పొలాల్లో పెట్టే విధానాన్ని వివరించారు. ఎలుకలు మందు కలిపే సమయంలో తప్పనిసరిగా చేతులకు గ్లౌజులు ధరించాలని, సాయంత్రం సమయంలో మాత్రమే ఎరను పొలాల్లో అమర్చాలని సూచించారు. నూకలతో కలిపిన బ్రోమోడయోలిన్ మందును చంద్రేడు, రంగంపేట రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ మహేష్, వీహెచ్‌ఏ శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

**ఎలుకల నివారణపై అవగాహన**

**రాజానగరం:** పంట పొలాలలో ఎలుకల ద్వారా చేకూరే నష్టాలను అధిగమించాలంటే రైతులందరూ సామూహికంగా ఎలుకల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఏడీఏ డి.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని సంపత్‌నగరంలో రైతులకు శుక్రవారం ఎలుకల మందును ఉచితంగా అందజేశారు. ఒక ప్రాంతంలోని రైతులు విడివిడిగా ఎలుకల నివారణకు మందులు పెట్టడం వలన పెద్దగా ప్రయోజనం ఉండన్నారు. ఎలుకల నివారణకు మందును తయారీ చేసే విధానాన్ని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్ ప్రయోగాత్మకంగా చేసి చూపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణ, రైతులతోపాటు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలతో సాగునీటి కష్టాలు



సీతానగరం వద్ద కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

**సీతానగరం:** పొలాలకు సాగునీరు అందించే తొర్రిగడ్డ కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు విపరీతంగా పేరుకుపోయాయి. వీటి కారణంగా నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం కలుగుతోంది. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరం, రఘుదేవపురం తదితర గ్రామాల వద్ద కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. సీతానగరం కాలువ గట్టును ఆనుకుని నివాసం ఉంటున్న కుటుంబాలు పలు ఇబ్బందులు పడుతున్నాయి. నీరు నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. విపరీతమైన దుర్గంధం వెలువడుతోంది. అలాగే కాలువ నుంచి రెగ్యులేటర్ల ద్వారా సబ్ కాలువలోకి నీరు వెళుతుంది. అయితే రెగ్యులేటర్ల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడటంతో సబ్ కాలువలోని సాగునీరు అతి తక్కువగా వెళుతోంది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రోడ్డు దాటితే ఇల్లు.. కాటేసిన మృత్యువు

- టిప్పర్ ఢీకొని మోటార్ సైక్లిస్టు మృతి
- కోటపాడులో ఘటన

**రంగంపేట:** టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో మోటారు సైక్లిస్టు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం .. మండల పరిధిలోని కోటపాడు శివారు అంబేడ్కర్ కాలనీకి చెందిన అర్జంగి ఆనందరావు (45) కాకినాడ పోర్టులో డైలీ కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పని ముగించుకుని కాకినాడ నుంచి కోటపాడుకు తన మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. కోటపాడు అంబేడ్కర్ కాలనీ వద్దకు వచ్చేసరికీ ఆయనను వెనుక నుంచి వచ్చిన టిప్పర్ వేగంగా ఢీకొని, కొంత దూరం ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో ఆనందరావు తలకు బలమైన గాయాలయ్యాయి. అతడిని బంధువులు వెంటనే 108లో పెద్దాపురం ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రోడ్డు దాటితే ఇంటికి వచ్చేసే వాడని, ఇంతలోనే లారీ రూపంలో మృత్యువు కబలించిందని బంధువులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా.. ఈ ప్రమాదంపై ఇంకా ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

### వివాహిత హత్య కేసులో నిందితుడి అరెస్టు

**బిక్కవోలు:** పందలపాకలో కురుపూడి లలితేశ్వరి (33) హత్య కేసులో నిందితుడిని గత నెల 30వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో అరెస్టు చేసినట్టు అనపర్తి సీఐ సుమంత్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పందలపాక గ్రామానికి చెందిన గుత్తికోలు దుర్గాప్రసాద్‌తో కురుపూడి లలితేశ్వరికి వివాహేతర సంబంధం ఉంది. అయితే కొద్ది రోజులుగా అతడిని లలితేశ్వరి దూరం పెట్టింది. దీంతో దుర్గాప్రసాద్ మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 29వ తేదీన లలితేశ్వరిని ఆమె పనిచేసే బరకాల కొట్టు వద్దకు రావాలని పిలిచాడు. అక్కడ వారిద్దరికీ వాగ్వాదం జరిగింది. దీంతో అక్కడే ఉన్న కేబుల్‌ను లలితేశ్వరి మెడకు చుట్టు, గట్టిగా నొక్కి చంపేశాడు. అనంతరం అక్కడి నుంచి దుర్గాప్రసాద్ పారిపోయాడు. పోలీసులు మొదట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తులో హత్యగా తేలింది.

### ఎమ్మెల్సీ పోలింగ్‌కు రెండు బూత్‌లు

**సీతానగరం:** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 1,500 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్ బూత్‌ల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ఈ నెల 27వ తేదీన జరుగుతుందన్నారు.

## రేపు దివాన్ చెరువులో మహాకుంభాభిషేకం

**రాజానగరం:** దివాన్ చెరువులోని హేరంబ గణపతి, బాలకుమారస్వామి సహిత విశ్వేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఆదివారం మహాకుంభాభిషేకం జరుగుతుంది. దీనిలో భాగంగా ఆలయంలో కొలువైన జగన్మాతకు మూడు రోజులుగా ప్రత్యేక పూజలు, అర్చనలు, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. డాక్టర్ కంభంపాటి రామ సుబ్రహ్మణ్యం (రాంబాబు) దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలలో భాగంగా నాలుగు రోజులుగా సాయంత్రం వేళలో సంగీత కచేరీ, పద్యగానం, కూచిపూడి నృత్యం, భాగవతోపన్యాసం జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం వీణా వాదం జరిగింది. శనివారం సద్గురు కందుకూరి శివానందమూర్తి శిష్యపరివారంచే 'గురువందనం' పేరుతో భక్తినీరాజనం సమర్పిస్తారని నిర్వాహకులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో విశ్వేశ్వరీ అమ్మవారు

### బాలికలకు వితరణ

**కంబాలచెరువు:** దానవాయిపేట బాల సదనం బాలికల వసతి గృహంలోని బాలికలకు శుక్రవారం దుప్పట్లు, టవళ్లు, 25 కేజీల బియ్యం, బిస్కెట్ ప్యాకెట్లను వ్యాపార వేత్త పాత్రు రాజేంద్ర అందజేశారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ వితరణ జరిపారు. కార్యక్రమంలో పీఎంపీ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, నిర్మల్ మాస్టారు, సదనం సిబ్బంది పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తో అనేక ప్రమాదాలు



కోరుకొండలో బైక్ ర్యాలీ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు

**మధురపూడి:** వాహనాలను నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోరుకొండలో ఆయన ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహన చోదకులందరూ హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలన్నారు. వాహనాలను నడిపేటప్పుడు నిబంధనలు పాటించాలని, ప్రాణరక్షణకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం, బైక్ రేసులు, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం తగదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీఐ వై.సత్య కిషోర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను పాటిద్దాం – సమాజ మనుగడకు ప్రాధాన్యత ఇద్దామని పిలుపునిచ్చారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు కోరుకొండలో బైక్ ర్యాలీ నిర్వహించామని, గత నెల 10న ప్రారంభమైన భద్రతా మాసోత్సవాలు ఫిబ్రవరి 10వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. కాగా.. గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నుంచి మొదలైన ర్యాలీ జిల్లా పరిషత్ హైస్కూల్ వరకూ జరిగింది. కార్యక్రమంలో కోరుకొండ ఎస్సై శ్యామ్ సుందర్, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమావళి పాటించాలి

**రాజానగరం/కడియం:** జాతీయ రహదారిపై ప్రయాణించే వాహన చోదకులందరూ రోడ్డు భద్రతా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని జాతీయ రహదారుల ప్రాజెక్టు మేనేజర్ కె.బాలసుబ్రహ్మణ్యం, టోల్ మేనేజర్ కర్రి వీర వెంకట సత్యనారాయణ రెడ్డి అన్నారు. 36వ జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాల ముగింపు సందర్భంగా ఎన్‌హెచ్ ఏఐ పీడీ కార్యాలయం నుంచి జాతీయ రహదారిపై వేమగిరి వరకూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. రాజమహేంద్రవరం సీఆర్‌పీఎఫ్ 42వ బెటాలియన్, టోల్ ప్లాజా ఉద్యోగులతో జాతీయ రహదారుల టెక్నికల్ మేనేజర్ అన్సారీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై రూపొందించిన పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పెద్ద వాహనాల డ్రైవర్లు విధిగా సీట్ బెల్టును ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయటకు వస్తే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిర్లక్ష్యం కారణంగా కుటుంబాలు వీధిన పడకూడదన్నారు. అతివేగం ప్రమాదకరమని, వేగంకన్నా సురక్షిత ప్రయాణం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఇంజినీర్ ఈ.వెంకట రమణ, క్రైం సీఐ రాంబాబు, ధవళేశ్వరం సీఐ గణేష్, క్యాషియర్ సురేష్, టోల్ ప్లాజా మేనేజర్ కరీం, హెచ్‌ఆర్ రమేష్ పాల్గొన్నారు.